

సభా వేదికపై అభివాదం చేస్తున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సురవరం సుధాకర్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకట్‌రెడ్డి, చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, అజీజ్‌ పాషా, నెల్లికంటి సత్యం, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఆదిరెడ్డి తదితరులు

న్యూస్‌రీల్‌

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ద్వారా 2024–25 సంవత్సరానికిగాను మైనార్టీ యువతీ యువకులకు హార్డ్‌ వేర్‌ అసిస్టెంట్‌ కోర్స్‌ లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జగదీశ్‌ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు అర్హత పత్రాలతో దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఈనెల ఆరవ తేదీలోగా సమర్పించాలని కోరారు. ఇతర వివరాల కోసం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం, జిల్లా కలెక్టర్‌ ఆఫీస్‌ మొబైల్‌ నంబర్‌ 9492611057, 9666499929లలో సంప్రదించాలని సూచించారు.

కోదాడ మార్కెట్‌ పాలకవర్గం నియామకం



చైర్‌పర్సన్‌ ఏపూరి తిరుపతమ్మ



వైస్‌ చైర్మన్‌ షేక్‌ బషీర్‌

కోదాడ: కోదాడ వ్యవసాయ మార్కెట్‌ పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చైర్‌పర్సన్‌గా నడిగూడేనికి చెందిన ఏపూరి తిరుపతమ్మ సుధీర్‌, వైస్‌ చైర్మన్‌గా కోదాడకు చెందిన మైనార్టీ నాయకుడు షేక్‌ బషీర్‌ను నియమించారు. వీరితో పాటు మరో 16 మందిని సభ్యులుగా నియమించారు. వీరిలో చింతకుంట్ల సూర్యం, కాసర్ల కోటయ్య, తమ్మనబోయిన వీరబాబు, కునుగుంట్ల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ మణి, రేపాని శ్రీను, మల్లు వెంకటరెడ్డి, బాణోతు అజ్మీరాసింగ్‌, దొంగల నాగవేణి, పోలంపల్లి వెంకటేశ్వర్లు, పోతుగంటి అభిరామ్‌, కాపెల్లి నర్సిరెడ్డి, అనంతగిరి పీఏసీఎస్‌ చైర్మన్‌, జిల్లా మార్కెటింగ్‌ మేనేజర్‌, కోదాడ ఏడీఏ, కోదాడ మున్సిపాలిటీ చైర్మన్‌ ఉన్నారు. ఈ పాలకవర్గం రెండేళ్లపాటు పదవిలో కొనసాగనుంది.

టీచర్‌ ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా విడుదల

తీపి..చేదు జ్ఞాపకాలు 8లో



నల్లగొండలో సోమవారం సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో నాయకులు, శ్రేణులు



డి.రాజా, సురవరం సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

శతాబ్ది ఉత్సవం.. నూతనోత్తేజం

నల్లగొండ టౌన్‌: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల పేరుతో ఆ పార్టీ నాయకత్వం సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభకు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు హాజరై తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నింపారు. అలాగే పార్టీ భవిష్యత్‌ కార్యాచరణపై దిశానిర్దేశం చేసి ఉత్సాహపరిచారు. ముందుగా సభకు తరలివచ్చిన వేలాది మంది కార్యకర్తలు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్రచీరలు ధరించి ఎర్ర జెండాలు పట్టుకుని గడియారం సెంటర్‌ నుంచి సభాప్రాంగణమైన ఎన్జీ కళాశాల వరకు కోలాట ప్రదర్శన, ఆటాపాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో వందలాది మంది రెడ్‌షర్ట్‌ వలంటీర్ల కవాతు, ప్రజానాట్య మండలి కళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీతోపాటు పట్టణంలో ఏర్పాటు చేసిన అరుణతోరణాలతో నీలగిరి పట్టణం ఎరుపెక్కింది.

కాంగ్రెస్‌లో జోష్‌

2024లో ఉమ్మడి జిల్లాలో ఆధిక్యం చూపిన 'హస్తం' పార్టీ

- రెండు ఎంపీ స్థానాల్లోనూ కాంగ్రెస్‌ జెండా
- ఇతర పార్టీల నుంచి భారీగా వలసలు
- అవిశ్వాసంతో డీసీసీబీ, పలు మున్సిపాలిటీలు, ఎంపీపీ పీఠాలు, పీఏసీఎస్‌లు కైవసం
- జిల్లా నేతలకు దక్కిన రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌ పదవులు



రివైండ్‌ 2024 పొలిటికల్‌

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2024 అధికార కాంగ్రెస్‌ పార్టీకి కలిసి వచ్చింది. ఈ ఏడాది జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను కాంగ్రెస్‌ పార్టీ నిలబెట్టుకుంది. మరోవైపు కాంగ్రెస్‌లోకి వలసల జోరు పెరిగింది. కీలకమైన డీసీసీబీ, మున్సిపల్‌ చైర్మన్‌ స్థానాలను అవిశ్వాసంతో హస్తగతం చేసుకున్న కాంగ్రెస్‌ జిల్లాలోని పలు ఎంపీపీ, పీఏసీఎస్‌ స్థానాలను సైతం చేజిక్కించుకుంది. ప్రస్తుతం మండల పరిషత్‌ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే.

సిట్టింగ్‌ స్థానాలను నిలబెట్టుకున్న కాంగ్రెస్‌

మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను కాంగ్రెస్‌ పార్టీ దక్కించుకుంది. గతంలో నల్లగొండ ఎంపీగా నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. వారిద్దరు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రులు అయ్యారు. ఈ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్‌ పార్టీ బరిలోకి దింపింది. వారిద్దరిని భారీ మెజారిటీతో గెలిపించుకుంది.

నీలగిరి చైర్మన్‌పై అవిశ్వాసంతో మొదలు

కాంగ్రెస్‌ పార్టీ పలు స్థానిక సంస్థలను క్రమంగా అధీనంలోకి తెచ్చుకుంది. ముఖ్యంగా నల్లగొండ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన చైర్మన్‌ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్‌ అవిశ్వాసం పెట్టింది. 2024 జనవరి 8న అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్‌ పార్టీ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిబ్రవరి 5న చైర్మన్‌ అయ్యారు. మొదట్లో మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు 22 మంది కౌన్సిలర్లు ఉండగా, ప్రస్తుతం నలుగురే మిగిలారు.

డీసీసీబీ కైవసం..

జిల్లా సహకార బ్యాంకును (డీసీసీబీ) అవిశాస అస్త్రంతో కాంగ్రెస్‌ పార్టీ చేజిక్కించుకుంది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న ఆలేరుకు చెందిన గొంగిడి మహేందర్‌రెడ్డిని పదవి నుంచి దించి.. కాంగ్రెస్‌ పార్టీ డైరెక్టర్‌ కుంభం శ్రీనివాస్‌రెడ్డి.. జూలై 1న చైర్మన్‌ అయ్యారు. అదే రోజు బాధ్యతలను స్వీకరించారు.

డీసీఎంఎస్‌ చైర్మన్‌ నియామకం..

కొన్నాళ్ల పాటు ఖాళీగా ఉన్న జిల్లా సహకార, మార్కెటింగ్‌ సొసైటీ (డీసీఎంఎస్‌) చైర్మన్‌ పదవిని కాంగ్రెస్‌ భర్తీ చేసింది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి సన్నిహితుడిగా ఉన్న వట్టె జానయ్యను డీసీఎంఎస్‌ చైర్మన్‌ను చేశారు. ఆయన పదవిని కోల్పోయిన తర్వాత వైస్‌ చైర్మన్‌గా ఉన్న నారాయణరెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. జూలై 19న నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీకి చెందిన కేతేపల్లి పీఏసీఎస్‌ చైర్మన్‌ బోళ్ల వెంకటరెడ్డి డీసీఎంఎస్‌ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

జిల్లాకు దక్కిన కార్పొరేషన్‌ పదవులు

ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలకు 2024లో కీలక పదవులు దక్కాయి. టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌గా పటేల్‌ రమేష్‌రెడ్డి, మహిళా ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్‌ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య, రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడిగా చెవిటి వెంకన్న యాదవ్‌, పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌గా నాగరిగారి ప్రీతమ్‌ను నియమించింది.

పలు స్థానిక సంస్థలు, పీఏసీఎస్‌లు కైవసం

- నకిరేకల్‌ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌కు నుంచి కాంగ్రెస్‌ చేజిక్కించుకుంది.
- తాటికల్లు పీఏసీఎస్‌ చైర్మన్‌ రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌ కొత్త చైర్మన్‌ను నియమించింది.
- చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్‌ను అవిశ్వాసంతో కాంగ్రెస్‌ దక్కించుకుంది.
- కోదాడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో.. కాంగ్రెస్‌లో చేరిన వారికే ఆ పదవిని అప్పగించారు.
- కోదాడ ఎంపీపీ పదవిని బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌ కైవసం చేసుకుంది.
- చిలుకూరు మండలం బేతవోలు, కోదాడ మండలం చిమిరియాల, నడిగూడెం పీఏసీఎస్‌ చైర్మన్‌ పదవులను కాంగ్రెస్‌ దక్కించుకుంది.
- హాలియా మున్సిపాలిటీ చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ పదవులను అవిశ్వాసంతోకాంగ్రెస్‌ కైవసం చేసుకుంది.
- తిరుమలగిరి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్మన్‌ పదవులు కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు దక్కాయి.
- మోత్కూరు మున్సిపల్‌ చైర్మన్‌, నాగార్జున రైతు సేవా సహకార సంఘం, అడ్డగూడురు పీఏసీఎస్‌ చైర్మన్‌ పదవులను కాంగ్రెస్‌ దక్కించుకుంది.
- భువనగిరి మున్సిపాలిటీలో 2023 డిసెంబర్‌ కాంగ్రెస్‌, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టి ఆ పదవులను రెండు పార్టీలు చెరొకటి దక్కించుకున్నాయి.
- నెరేడుగొమ్ము ఎంపీపీ పదవిని కాంగ్రెస్‌ దక్కించుకుంది.
- రామన్నపేట ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించడంతో రాజీనామా చేసిన కారణంగా కొత్త ఎంపీపీని కాంగ్రెస్‌ ఎన్నుకుంది.
- నేరేడుచర్ల చైర్మన్‌, వైస్‌ చైర్‌పర్సన్‌ పదవులను కాంగ్రెస్‌ దక్కించుకుంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌

భానుపురి (సూర్యాపేట) : అర్హులను గుర్తించేందుకే ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌ పి.రాంబాబుతో కలిసి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారులు తప్పకుండా వారానికి రెండుసార్లు సర్వే వివరాలపై సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలన్నారు.

పెద్దగట్టు జాతరను విజయవంతం చేయాలి

అన్నిశాఖలు సమన్వయం చేసుకుంటూ పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌ కోరారు. పెద్దగట్టు జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. జాతర కోసం 70 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. గట్టుపై భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్‌ ఏర్పాటు చేయాలన్నారు. ఎండ తగలకుండా చల్లని చలువ పందిరి, గుడి చుట్టూ కలరింగ్‌ లైట్స్‌ ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్‌ సమస్య లేకుండా, వ్యర్థాలను తరలించేందుకు ఎక్కువ సిబ్బంది, ట్రాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా మిషన్‌ భగీరథ అధికారులు, మున్సిపల్‌ అధికారులు సమన్వయం చేసుకోవాలని, అప్రోచ్‌ రోడ్లు త్వరగా పూర్తి చేయాలని, కోనేరు వద్ద కలర్‌ లైటింగ్‌ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, డీఎఫ్‌ఓ సతీష్‌ కుమార్‌, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌, డీఎస్పీ రవి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఈఓ అశోక్‌, మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌, పరిపాలన అధికారి సుదర్శన్‌ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఆరు కేటగిరీల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మండల స్పెషల్‌ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఎంపీఓలు, ఈసీలతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌, మహిళాశక్తి, ఉపాధి భరోసా పథకంలో క్యాంటీన్‌ షెడ్లు, అజోల, నాడప్‌ కంపోస్ట్‌ పిట్‌, వర్మి కంపోస్ట్‌, పౌల్ట్రీ షెడ్‌ వంటి పనులను చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో 50 రకాల కన్నా ఎక్కువ మొక్కలను పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ పి. రాంబాబు, డీఆర్‌డీఓ పీడీ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి పాల్గొన్నారు.


ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

సూర్యాపేటటౌన్‌ : ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్‌ నాయుడు డిమాండ్‌ చేశారు. జనవరి 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌ వద్ద జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావానికి సంబంధించిన వాల్‌ పోస్టర్లను సోమవారం సూర్యాపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. కోర్సులు పూర్తయినా ఫీజు రీయింబర్స్‌ మెంట్‌ రాక ఒరిజినల్‌ సర్టిఫికెట్లు కళాశాల నుంచి తీసుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్‌ సుహాసిని, ధరావత్‌ అఖిల, సింధు, శ్రావ్య , కావేరి, వెన్నెల, సిరి తదితరలు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల.. నెరవేరిన వేళ



నిరుద్యోగులకు కలిసివచ్చిన 2024

- విద్యా, వైద్య, గ్రూప్‌–4, పోలీస్‌ శాఖల్లో నియామకాలు
- గ్రూప్‌–2, 3 ఉద్యోగాలకు పరీక్షల నిర్వహణ
- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి
- ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగుల్లో ఉత్సాహం

రివైండ్‌ 2024 జాబ్స్‌

సూర్యాపేటటౌన్‌ నిరుద్యోగులకు ఈ ఏడాది కలిసొచ్చింది. ప్రభుత్వం పలు శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసింది. గడిచిన పదేళ్ల కాలంలో ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల కావడం కోర్టు కేసులతో పరీక్షలు నిర్వహించకపోవడం.. ఒకవేళ నిర్వహించినా లీకేజీ కారణంగా రద్దయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో నిరుద్యోగులంతా నిరాశలో ఉండిపోయారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించి కొన్ని పరీక్షలు నిర్వహించడంతోపాటు.. పోస్టింగ్‌లు కూడా ఇచ్చింది. దీంతో చాలామంది ఉద్యోగాలు పొందారు. ఈ ఏడాది తమకు ఎంతో కలిసొచ్చిందని కొత్తగా కొలువులు సాధించిన అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయ నియామకాలు..

కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు అదనంగా మరికొన్ని పోస్టులు కలిపి.. డీఎస్సీ– 2024 నోటిఫికేషన్‌ ఇచ్చింది. పరీక్ష నిర్వహించి ఫలితాలను వెంటనే ప్రకటించింది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. వీరికి మెరిట్‌ ప్రకారం అక్టోబర్‌ నెలలో స్కూళ్లను కేటాయించారు.

వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీ..

2024 సంవత్సరంలో పలు శాఖలలో ఉద్యోగాలు భర్తీ చేసింది. ప్రధానంగా పోలీస్‌ శాఖలో కానిస్టేబుళ్ల నియామకం పూర్తయింది. వారంతా ట్రైనింగ్‌ పూర్తి చేసుకుని విధుల్లో చేరారు. వైద్యారోగ్యశాఖలో స్టాఫ్‌ నర్సుల, డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, రేడియాలజిస్టులు, ల్యాబ్‌ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు తదితర పోస్టులను భర్తీ చేసింది. వారికి వైద్య విధాన పరిషత్‌, వైద్య ఆరోగ్య శాఖతో పాటు మెడికల్‌ కళాశాలల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. గురుకులాల్లో వివిధ కేటగిరిల్లో ఉద్యోగాలను భర్తీ చేసింది. ప్రధానంగా జూనియర్‌ లెక్చరర్‌, డిగ్రీ లెక్చరర్‌, పీజీటీ, టీజీటీ, జూనియర్‌ అసిస్టెంట్‌, లైబ్రేరియన్‌ తదితర పోస్టులకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించి పోస్టింగ్‌లు ఇచ్చింది. వీటితో పాటు ఇతర శాఖల్లోనూ ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించారు. సీడీపీఓ, డీఏఓ పరీక్షలు నిర్వహించారు. ఇరిగేషన్‌, విద్యుత్‌ శాఖల్లో కూడా ఏఈల నియామకంతో పెద్ద ఎత్తున జిల్లాలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు పొందారు.

ఉద్యోగం	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
ఉపాధ్యాయ	540	322	252
వైద్యశాఖ	313	35	86
గ్రూప్‌–4	55	52	142
పోలీస్‌ శాఖ	396	281	164
గురుకులాల్లో	1012	500	186

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు



ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ ఈ ఏడాది జూలైలో పూర్తయింది. ఏళ్లుగా బదిలీ కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు తాము కోరుకున్న చోట బదిలీ జరగడంతో సంతోషంలో ఉన్నారు. ఎస్‌జీటీలు స్కూల్‌ అసిస్టెంట్లుగా, ఎల్‌ఎఫ్‌ఎల్‌ హెచ్‌ఎంలుగా.. స్కూల్‌ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందారు. నల్లగొండ జిల్లాలో 1023 మందికి ప్రమోషన్‌ లభించగా.. 2291 మందికి బదిలీ అయ్యింది. సూర్యాపేట జిల్లాలో 102 మంది జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందగా.. 641 మంది ఎస్‌జీటీలకు స్కూల్‌ అసిస్టెంట్‌లుగా, ఎల్‌ఎఫ్‌ఎల్‌ హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. మొత్తం 800 మందికి ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 400 మందికి పదోన్నతి లభించగా, 590 మందికి బదిలీ అయ్యింది.

గ్రూప్‌-2, 3 పరీక్షల నిర్వహణ

గ్రూప్‌-4లో పలువురు నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గ్రూప్‌-4 పరీక్షలు నిర్వహించగా.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఫలితాలు ప్రకటించి పోస్టింగ్‌లు ఇచ్చింది. అదే విధంగా గ్రూప్‌-2, 3కి గత ప్రభుత్వం నోటిఫికేషన్‌ ఇవ్వగా.. ప్రస్తుత ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. వాటి ఫలితాల కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్‌ వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగాలను సాధించేందుకు కోచింగ్‌ సెంటర్లతో పాటు గ్రంథాలయాలలో ప్రిపేర్‌ అవుతున్నారు.

ఎంతో కష్టపడ్డాను



పోలీస్‌ ఉద్యోగం రావాలనే సంకల్పంతో ఎంతో కష్టపడ్డాను. 2024లో పోలీస్‌ ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉంది. నా భర్త ప్రోత్సాహంతో పోలీస్‌ కొలువు సాధించగలిగాను. ఈ సంవత్సరం చిరకాలం మరిచిపోలేనిది.

– వర్దెల్లి భవాని, కర్విరాల కొత్తగూడెం, సివిల్‌ కానిస్టేబుల్‌

రెండేళ్లు ప్రిపేరై ఉద్యోగం సాధించా



టీచర్‌ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. రెండేళ్లుగా డీఎస్సీ కోసం ప్రిపేర య్యాను. ఈ ఏడాదిలో డీఎస్సీ రాసి టీచర్‌ కొలువు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ఏడాది(2024) నా జీవితంలో మరచిపోలేను. ప్రస్తుతం నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్నాను. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

– ఉమా, స్కూల్‌అసిస్టెంట్‌(సోషల్‌), సూర్యాపేట

లక్ష్యం చేరుకున్నాను



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే నా లక్ష్యం 2024లో నేరవేరింది. సివిల్‌ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం ట్రైనీ ఎస్‌ఐగా పని చేస్తున్నాను. నూతన సంవత్సరంలో గ్రూప్‌–1 ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– పందిరి ప్రియాంక, సివిల్‌ ఎస్‌ఐ

ఇథనాల్‌ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని మోతె మండలం రావిపహాడ్‌ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఎస్‌ఎంకె ఇథనాల్‌ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. ఇథనాల్‌ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌ ఎదుట సీపీఐ (ఎంఎల్‌) మాస్‌ లైన్‌ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన చట్టాన్ని అడ్డుపెట్టుకొని దొడ్డిదారిలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఇథనాల్‌ ఫ్యాక్టరీ అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్‌ లింగంపల్లి భద్రయ్య, ప్రజా ఫ్రంట్‌ అధ్యక్షులు కోటయ్య, పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌ కుమార్‌, మల్లారెడ్డి, నరసింహారావు, సంగెం లింగయ్య, కాకి పాపిరెడ్డి, పరమేష్‌, పేర్ల నాగయ్య, నర్సయ్య, వాస పల్లయ్య, చంద్రకళ, సూరం రేణుక పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం

– ఎస్పీ సన్‌ప్రీత్‌ సింగ్‌

వివరాలు 8 లో



VANDANA ADS, Nlg. Cell: 98485 66222

క్లుప్తంగా

నల్లగొండ కలెక్టర్‌గా పనిచేసిన ఏపీ నూతన సీఎస్ విజయానంద్



నల్లగొండ : ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన విజయానంద్ గతంలో నల్లగొండ కలెక్టర్‌గా పనిచేశారు విజయానంద్ పూర్వపు నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా దాదాపు మూడు సంవత్సరాలు పనిచేశారు. 2004 జూన్ 22న నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయానంద్ 2007 జూన్1 వరకు పనిచేశారు.

సాగర్ గెస్ట్‌హౌస్‌లన్నీ బుకింగ్

- న్యూ ఇయర్ వేడుకలకు సన్నాహాలు



ముస్తాబైన విజయవిహార్ అతిథి గృహం

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నాగార్జునసాగర్‌లో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు వచ్చిన ఔత్సాహికులతో స్థానిక అతిథి గృహాలన్నీ (గెస్ట్‌హౌస్‌లు) కిటకిటలాడుతున్నాయి. ఇరవై రోజుల క్రితమే విజయవిహార్‌లోని గదులన్నింటినీ ఐటీ కంపెనీల ఉద్యోగులు, వివిధ క్లబ్‌లకు చెందిన వారు ముందస్తుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. దీంతో టైగర్ వ్యాలీ, మనోరమ హోటల్, సాగర్‌డ్యాం ఆవలివైపున నూతనంగా నిర్మించిన మాతా సరోవర్ రిసార్ట్స్, ఇతర చిన్నాచితక లాడ్జీలు ఆది, సోమవారాల్లో సందడిగా మారాయి. ఆయా అతిథి గృహాలు, హోటళ్లు, రిసార్ట్స్‌లలో మంగళ, బుధవారాల్లో న్యూఇయర్ వేడుకలను ఉల్లాసంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

పురుగుల మందుతాగి వృద్ధుడి ఆత్మహత్య

ఆత్మకూర్(ఎస్): మానసిక స్థితి సరిగ్గా లేని వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందగట్ల గ్రామానికి చెందిన బొల్లె శివయ్య (70)కు గత రెండేళ్లుగా మానసిక స్థితి సరిగ్గా ఉండటం లేదు. ఆదివారం సాయంత్రం శివయ్య ఇంట్లో గడ్డి మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బొల్లె సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

WANTED
1) PRINCIPAL
2) Computer Assistant
SRI VIDHYALAYA PRIMARY SCHOOL
(Nursery to VI Class)
Sagar Road, Venkatapuram Stage, Haliya (M)
Contact: 9885660300

సాక్షి క్లాసిఫైడ్స్

Education
రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr.J S అకాడమి (ISO 9001: 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112 [HA-15347]

Real Estate
HOUSE FOR SALE
2,3 & 4BHK లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉంది! రూ.80 లక్షల నుండి.డి-మార్ట్ ప్రక్కన, మిర్యాలగూడ. ఆధునిక సౌకర్యాలు. క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్. Ph: 7013578378 [HA-1024]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులు లను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే రేటా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన కోరండి! స్పందన పొందండి!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ: 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ: 9666021744
సూర్యాపేట: 9912220740 9010038110
కోదాడ: 9010046033
భువనగిరి: 9010073592



కాలచక్రంలో మరో ఏడాది గడిచిపోయింది. 2024 సంవత్సరం ఎన్నో ఘటనలు చోటుచేసుకున్నాయి. మరెన్నో మార్పులు జరిగాయి. కొన్ని తీపి జ్ఞాపకాలుగా.. మరికొన్ని చేదు గుర్తులుగా మిగిలిపోయాయి. సంవత్సరం మొత్తంలో జరిగిన ఘటనల్లో కొన్ని ఇవీ..

తీపి..చేదు జ్ఞాపకాలు

2024లో ప్రధాన సంఘటనల సమాహారం..

జనవరి

- 25వ తేదీన కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. పద్మశ్రీ పురస్కారాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్‌లాల్, యాదాద్రి స్థపతి వేలు ఆనందచారి ఎంపికయ్యారు.
- 29న మిర్యాలగూడ పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. మృతులంతా నందిపాడు గ్రామానికి చెందినవారు.

ఫిబ్రవరి

- 5వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- 14న కృష్ణా జలాల పరిరక్షణ పేరుతో బీఆర్‌ఎస్ నిర్వహించిన 'చలో నల్లగొండ' బహిరంగ సభకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ హాజరై ప్రజలనుద్దేశించి మాట్లాడారు.
- 19న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకిలో ఆచార్య కూరెళ్ల విఠలాచార్య గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

మార్చి

- 2వ తేదీ బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ముగిసింది. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ హాజరయ్యారు.
- 3న ఆర్యసమాజ్ శతాబ్ది వేడుకలకు యోగాగురు రాందేవ్ బాబా హాజరయ్యారు.
- 12న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.
- 31వ తేదీన సూర్యాపేట జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటించారు. వెలుగుపల్లి, ఎర్రారం గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించారు.

ఏప్రిల్

- 21న భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- 24న నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- 25వ తేదీన భువనగిరిలో కేసీఆర్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు.
- 28వ తేదీన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది.

మే

- 6వ తేదీన బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం నల్లగొండలో జరిగిన సభకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా హాజరయ్యారు.
- 10వ తేదీన నకిరేకల్‌లో జరిగిన కాంగ్రెస్ జన జాతర సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు.
- 14వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగింది.
- 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ముగిసింది. 66.75శాతం ఓటింగ్ నమోదైంది.

జూన్

- 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరిలో కాంగ్రెస్ గెలిచింది.
- 7వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ముగిసింది. రెండో ప్రాధాన్యత ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న గెలుపొందారు.
- 28న డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టగా.. 15 మంది డైరెక్టర్లు అనుకూలంగా చేతులెత్తడంతో బీఆర్‌ఎస్ నేత మహేందర్‌రెడ్డి పదవిని కోల్పోయారు.

జూలై

- 2వ తేదీన డీసీసీబీ చైర్మన్‌గా మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- 18న ఆత్మకూరు (ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో గల క్వారీ గుంతలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి చెందారు.
- 25న చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కర్నాటి ముఖేష్ తయారు చేసిన చీర జాతీయ పురస్కారానికి ఎంపికైంది.

ఆగస్టు

- 3వ తేదీన సాగర్ ఎడమకాలువకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేశారు.
- 15వ తేదీన చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది.
- 29వ తేదీన గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ యాదాద్రి జిల్లాలో పర్యటించారు. కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు.

సెప్టెంబర్

- 1వ తేదీన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాలువ తెగిపోయింది.
- 2వ తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీ వర్షాల వల్ల జరిగిన ఆస్తి, పంటలు నష్టపోయిన వారికి తగిన పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన అధికారుల సమీక్షలో వెల్లడించారు.
- 3న సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్టను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు.
- 5న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి నల్లగొండలో పర్యటించారు. బీజేపీ నేత ఓరుగంటి రాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- 6న తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.
- 12న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను కేంద్ర బృందం పరిశీలించింది.
- 14వ తేదీన మదర్ డెయిరీ చైర్మన్‌గా గుడిపాటి మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అక్టోబర్

- 11వ తేదీన నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.
- 18వ తేదీన ఎంజీయూ వీసీగా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు.
- 22వ తేదీన నల్లగొండ పరిధిలోని అన్నెపర్తి 12 బెటాలియన్‌లో పోలీస్ కుటుంబాల ఆందోళనతో ఆరుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు.
- 24వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు.

నవంబర్

- 3వ తేదీన దామరచర్ల మండలంలోని యాద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు యూనిట్ -1 సిక్రనైజేషన్ ప్రారంభించారు.
- 8వ తేదీన యాదాద్రి జిల్లాలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పర్యటన చేశారు. వలిగొండ మండలంలోని భీమలింగం వద్ద మూసీని పరిశీలించారు.
- 14న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరయ్యారు.

డిసెంబర్

- 4వ తేదీన ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, చిట్యాల, భూదాన్ పోచంపల్లి, నూతనకల్, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి.
- 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పంపులను ప్రారంభించారు. దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రెండో యూనిట్‌ను గ్రిడ్‌ను అనుసంధానం చేశారు. నల్లగొండ సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ వద్ద మెడికల్ కళాశాల భవనంతో పాటు బాలుర, బాలికల హాస్టల్ భవనాలను ప్రారంభించారు. ఆ తరువాత బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.
- 7వ తేదీన భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జలాల్‌పురం చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు యువకులు జలసమాధి అయ్యారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డాడు.

ఎర్ర జెండాలన్నీ ఏకం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



పార్టీ రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టౌన్: విడిపోయిన ఎర్ర జెండాలన్నీ ఏకం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. దేశంలో ప్రజా సమస్యలన్నింటి పరిష్కారానికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ 99 వసంతాలు పూర్తి చేసుకుని ఈ నెల 26 నాటికి వంద సంవత్సరాల్లోకి అడుగు పెడుతున్న సందర్భంగా పోరాటాల ఖిల్లా అయిన నల్లగొండలో సభ నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తొలి అమరుడు దొడ్డి కొమురయ్యతో పాటు చాకలి ఐలమ్మ, బందగి వంటి అమరులను కన్న నల్లగొండ జిల్లాలోనే వందేళ్ల ఉత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించిందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు లేనంత మాత్రాన కొందరు మూర్ఖులు కమ్యూనిస్టుల పని అయిపోయిందని వ్యాఖ్యలు చేయడం అవివేకమన్నారు. కమ్యూనిస్టు పార్టీలో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అయ్యే సత్తా కలిగిన కార్యకర్తలు ఉన్నారని కానీ తమకు పదవులు, అధికారం ముఖ్యం కాదు ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాడటమే లక్ష్యమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదాన్ని, అభివృద్ధి నిరోధకులను నిరోధించడంలో కమ్యూనిస్టు పార్టీ ముందుందన్నారు. సీపీఐ పటిష్టతకు పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో జిల్లాలో పార్టీని పునర్ నిర్మించుకొని బలోపేతం చేయడానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి డి. రాజా, మాజీ ఎంపీ అజీజ్ పాషా, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, స్వాతంత్ర్య సమరయోధులు ప్రతాప్‌రెడ్డి, యాదగిరి, దొడ్డ నారాయణరావులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పశ్య పద్మ, టి. శ్రీనివాస్‌రావు, కల్వల శంకర్, ఎం. బాల నర్సింహ, బాగం హేమంతరావు, నర్సింహ, బి.ఎస్.బోస్, గోద శ్రీరాములు, బెజవాడ వెంకటేశ్వర్లు, బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్ రెడ్డి, పబ్బు వీరస్వామి, రాజారెడ్డి, మౌలానా, యూసుఫ్, సీతారాములు, అయోధ్య, సంఘయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

టీచర్ ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా విడుదల

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా సోమవారం విడుదలైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 24,905 అర్హులైన ఓటర్లు నమోదయ్యారు. ఈ ఓటరు జాబితాలను నియోజకవర్గ పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టరేట్లు, ఆర్‌డీవో కార్యాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీ పదవీ కాలం 2025 మార్చి 29వ తేదీతో ముగుస్తోంది. మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు 9,965 పురుష ఓటర్లు 14,940 మంది ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితా కంటే తుది జాబితాలో 2,351 మంది పెరిగారు. వారంతా ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులని టీచర్ ఎమ్మెల్సీ రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. 12 జిల్లాల పరిధిలోని 191 మండలాల్లో 200 పోలింగ్ స్టేషన్లను ఈ ఎన్నికల కోసం సిద్ధం చేశారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 8 తులాల బంగారం, ఆటో, బైక్ స్వాధీనం



నిందితుడిని, స్వాధీనం చేసిన సొత్తును చూపుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సోమవారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పోతమయ్యగడ్డ గ్రామానికి చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్ గతంలో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. జైలులో ఉన్న సమయంలో సిరిసిల్ల జిల్లా పెద్దబజారు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సందరికారి సతీష్‌తో అతడికి పరిచయం ఏర్పడింది. వీరిద్దరు కలిసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అనేక చోరీలు చేశారు. రెండు నెలల క్రితం జైలు నుంచి విడుదలైన వీరు మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు. నార్కట్‌పల్లిలో నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా చిట్యాల వైపు ఆటోలో వెళ్తున్న వీరిద్దరిని పోలీసులు ఆపి విచారించగా.. ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. నిందితుల నుంచి రూ.10 లక్షల విలువైన 8 తులాల బంగారం, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఇన్‌చార్జి సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ క్రాంతికుమార్, సిబ్బంది రాము, శివ, శంకర్, గిరిబాబు, తిరుమల్, సత్యనారాయణ, అఖిల్, మహేష్, సాయికుమార్‌ను ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



గడ్డం జాన్‌రెడ్డి (ఫైల్)



జాన్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం కొత్తగూడెం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గడ్డం జాన్‌రెడ్డి(40), కొండా సైదులు ఆదివారం రాత్రి గ్రామ శివారులోని జాన్‌రెడ్డి పొలం వద్ద పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిని క్రాస్ చేస్తుండగా.. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాన్‌రెడ్డి, సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో ఇద్దరిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. జాన్‌రెడ్డి భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ జాఫర్ తెలిపారు. జాన్‌రెడ్డి మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరామర్శ..

జాన్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం కొత్తగూడెం గ్రామానికి చేరుకుని జాన్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. జాన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని మంత్రి అన్నారు. జాన్‌రెడ్డి కుటుంబానికి తాను అండగా ఉంటానని, అతడి పిల్లల చదువు బాధ్యత తాను తీసుకుంటానన్నారు. మంత్రి వెంట డీసీసీబీ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, నాయకులు వడ్డె సైదిరెడ్డి, వెంకన్న, నరేష్, సిద్ధార్థరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అంతకుముందు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో జాన్‌రెడ్డి భౌతికకాయానికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నివాళులర్పించారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండా సైదులును పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సూదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం

- ఈ ఏడాది క్రైం రేటు తగ్గింది
- కొత్త సంవత్సరంలోనూ బాగా పనిచేస్తాం
- క్రైం వార్షిక నివేదిక వెల్లడించిన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



క్రైం వార్షిక నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, డీఎస్పీలు తదితరులు

సూర్యాపేటటౌన్ : ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అవలంబిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీస్ వార్షిక నివేదికను వెల్లడించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేస్తున్నామన్నారు. వార్షిక నివేదిక వివరాలు ఆయన మాటల్లోనే..

పెరిగిన దొంగతనాలు.. రోడ్డు ప్రమాదాలు

గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. 2023లో 573 రోడ్డు ప్రమాదలు జరగగా 2024లో 609 జరిగాయి. 2023లో 390 దొంగతనాలు జరగగా 2024లో 536 జరిగాయి. ఈ సంవత్సరం డయల్ 100 కు ఫోన్ కాల్ ద్వారా 34,950 ఫిర్యాదులు రాగా సగటున 6 నిమిషాల్లో బాధితులకు పోలీసు సేవలు అందించారు. ఈ ఏడాది కేసులు తగ్గుముఖం పట్టాయి. 2023లో 7,244 కేసులు నమోదు కాగా 2024లో 7178 కేసులు నమోదయ్యాయి.

- ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలను జూలై నుంచి జిల్లాలో అమలు చేస్తుండగా ఇప్పటి వరకు కొత్త చట్టాల కింద 3513 కేసులు నమోదు చేశాం. మొదటి కేసును గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైంది.
- సైబర్ మోసాలు పెరుగుతున్నాయని ఈ సంవత్సరం 1,212 ఫిర్యాదులు రాగా 205 కేసులు నమోదు చేశాం. సైబర్ మోసాల ద్వారా మోసానికి గురైన రూ.7.83 కోట్ల నుంచి సుమారు రూ.40లక్షలు బాధితులకు రిఫండ్ చేయించాం. రూ.1.16 కోట్లు బ్యాంక్‌ల్లో హోల్డ్ చేయించాం.
- 38 గంజాయి కేసుల్లో 318 కేజీల గంజాయిని సీజ్ చేసి 135 మందిని జైలుకు పంపించాం. గత ఏడాదితో పోలిస్తే గంజాయి కేసుల్లో ఎక్కువ మందిని అరెస్టు చేశాం. ప్రజా పంపిణీకి చెందిన బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఈ సంవత్సరం 178 కేసులు నమోదు చేసి 3,200 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశాం. బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 2023 సంవత్సరంతో పోలిస్తే 2024లో 160శాతం ఎక్కువగా పీడీఎస్ రైస్ కేసులు నమోదు చేసి 193శాతం ఎక్కువగా బియ్యం సీజ్ చేశాం. 289 మందిని రిమాండ్‌కు తరలించి ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేశాం.
- నేరాల్లో శిక్షల అమలుకు సంబంధించి ఈ సంవత్సరం 1,082 కేసులు వాదనకు రాగా 32 కేసుల్లో 24 మందికి జైలు శిక్షలు అమలు అయ్యాయి. వీటిలో ఆరుగురికి జీవిత ఖైదు, ఇద్దరికి 15 సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికి 10 సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికి ఐదు సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికి మూడు సంవత్సరాల పైబడి శిక్ష, ఇద్దరికి సంవత్సరం పైబడి శిక్ష, మరో ఎనిమిది మందికి సంవత్సరంలోపు శిక్షలు అమలయ్యాయి.
- రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గత సంవత్సరం 573 కేసుల్లో 257 మంది మరణించగా ఈ సంవత్సరం 609 కేసుల్లో 262 మంది మృత్యువాత పడ్డారు. ఈ మృత్యువాత పడ్డ వారిలో 320 కేసుల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై 151 మంది మృత్యువాత పడ్డారు.
- మహిళల భద్రతకు సంబంధించి జిల్లాలో స్థానిక పోలీసులతో కలిసి షీ టీమ్స్, భరోసా సెంటర్స్ పనిచేస్తున్నాయి. ఈ సంవత్సరం షీ టీమ్స్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 165 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. 2023లో షీ టీమ్స్‌కి 141 ఫిర్యాదులు రాగా ఈ సంవత్సరం 75 ఫిర్యాదులు వచ్చాయి. 135 ఫ్యామిలీ కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాం. షీ టీం సిబ్బంది ప్రజల్లో తిరుగుతూ 98 పిట్టి కేసులను నమోదు చేశారు.
- మహిళా కేసులకు సంబంధించి గత సంవత్సరం 5,503 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 557 కేసులు నమోదయ్యాయి. మహిళలపై వేధింపులు, అత్యాచార కేసులు పెరిగాయి. పోలీసు ప్రత్యేక చర్యల వల్ల ఈ సంవత్సరం ఈ టీజింగ్ కేసులు 18 శాతం తగ్గాయి.